క్లుప్తంగా

పీహెచ్‌సీకి విరాళంగా టైఫాయిడ్ కిట్లు



నల్లజర్ల పీహెచ్‌సీకి టైఫాయిడ్ కిట్లు అందిస్తున్న సీతారాముడు

నల్లజర్ల: రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం నల్లజర్ల పీహెచ్‌సీకి పలు రకాల వైద్య పరికరాలను అందించింది. అయితే ఈ పరీక్షల నిర్వహణకు అవసరమైన కిట్లు ఈ పీహెచ్‌సీలో అందుబాటులో లేవు. ఈ విషయం తెలుసుకున్న పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు బోడిగడ్ల సీతారాముడు 200 టైఫాయిడ్ టెస్ట్ కిట్లను మంగళవారం నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావుకు అందజేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో తాము కూడ భాగస్వాములం అవుతామని సీతారాముడు ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రశేఖరరాజు, ల్యాబ్ టెక్నీషియన్ షరీఫ్, సూపర్‌వైజ్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై విస్తృత ప్రచారం



కొవ్వూరులో అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొవ్వూరు: అగ్నిమాపక వారోత్సవాల ఐదో రోజైన మంగళవారం అగ్ని ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఏవిధంగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది? వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అవంతీ ఫీడ్స్ ఫ్యాక్టరీ, ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ, వెంకటేశ్వర పెట్రోలు బంక్‌ల యాజమానులు, సిబ్బంది, ఉద్యోగులకు వివరించారు. ఏదైనా ప్రమాదం ఏర్పడినపుడు అగ్నిమాపక సిబ్బంది వచ్చే లోగా అందుబాటులో ఉండే అగ్నిమాపక పరికరాలు వినియోగించే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించామని కొవ్వూరు అగ్నిమాపక అధికారి కె.రాముడు తెలిపారు. అక్కడి సిబ్బందితో మంటలు అదుపు చేయించారు. మాక్‌డ్రిల్ ద్వారా గోడౌన్‌లలో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో వివరించారు. సకాలంలో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందిస్తే ప్రాణ, ఆస్తినష్టం తీవ్రతను తగ్గించుకునే అవకాశం ఉంటుందన్నారు.

సొసైటీ వద్ద చలివేంద్రం

దేవరపల్లి: స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద దేవరపల్లి సొసైటీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ కవల శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. మినరల్ వాటర్ పంపిణీ చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఏటా ఏప్రిల్ నెలలో చలివేంద్రం ఏర్పాటు చేసి జూన్ వరకు ఉంచుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కేఎస్ఎస్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

రావూరుపాడులో స్వల్ప వివాదం



రావూరుపాడు ఘటనా స్థలంలో స్థానికులతో మాట్లాడుతున్న పోలీసులు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం పంచాయతీ పరిధిలోని రావూరుపాడు గ్రామంలో చిన్న వివాదం చోటు చేసుకుంది. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన అభిమానులు గ్రామంలోని విద్యుత్తు స్తంభాలకు రంగులేసి జై భీమ్ అని రాశారు. జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. కొందరు కుర్రకారు విద్యుత్తు స్తంభాలపై ఉన్న జై భీమ్ అనే పదాన్ని చెరిపేసి వేరే కులం పేరుతో రాతలు రాసి వివాదానికి తెర లేపారు. ఈ వివాదం పెద్దది కాకుండా పోలీసులు తక్షణం స్పందించి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాతలు రాసిన యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఇరు వర్గాల వారితో మాట్లాడి వివాదం సద్దుమణిగేలా చేశారు. కొవ్వూరు రూరల్ సీఐ రమణ, ఎస్సైలు కె. వెంకటరమణ, జి సతీష్, తహసీల్దార్ టి. రాధిక తదితరులు ఘటనా ప్రదేశాన్ని పరిశీలించారు.

పెరవలి లయన్స్ క్లబ్‌కు గవర్నర్ ప్రశంసలు

పెరవలి: లయన్స్ క్లబ్ పెరవలి శాఖ అందిస్తున్న సేవలను ఆ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ పంకజాక్షన్ కొనియాడారు. వార్షిక పర్యటనలో భాగంగా పంకజాంక్షన్ మంగళవారం పెరవలి క్లబ్ చేసిన సేవలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నవరప్పాడులో నిర్వహించిన క్లబ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 13 ఏళ్ల క్రితం వంక రవీంద్రనాథ్ ఏర్పాటు చేసిన ఈ క్లబ్ తన సేవల ద్వారా ఎన్నో అవార్డులను సొంతం చేసుకుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీలు మద్దుకూరి శ్రీహరి, స్వామి, కె. రామలింగేశ్వరరావు, వంక రాజకుమారి, మాదిరెడ్డి బాబూజీరావు, పెరవలి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారి, సెక్రటరీ సలాది ఉదయ భాస్కరరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఘాటు తగ్గిన పల్లంట్ల మిర్చి రేటు

- కిలో రూ.600 నుంచి రూ.370 కి పతనం
- ఎగబడుతున్న కొనుగోలుదారులు



దేవరపల్లి మండలం పల్లంట్ల కళ్లంలో ఎండు మిర్చి

దేవరపల్లి: ఎండు మిర్చి రేటు ఎట్టకేలకు దిగొచ్చింది. దాంతో వినియోగదారులతో ఎండుమిర్చి కళ్లాలు కళకళలాడుతున్నాయి. మొన్నటి వరకు కిలో రూ.600 పలికిన ఎండుమిర్చి ఇప్పుడు రూ.370 కు తగ్గింది. ధర తగ్గడంతో వినియోగదారులు కళ్లాల్లోకి వెళ్లి తమ అవసరాల మేరకు కాయలను కొనుగోలు చేసి తీసుకు వెళుతున్నారు. నాణ్యమైన ఎండు మిర్చి తయారీలో మండలంలోని పల్లంట్ల, కురుకూరు గ్రామాలకు మంచి గుర్తింపు ఉంది. ఈ రెండు గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో మిరప సాగు చేస్తున్నారు. దేశవాళీ రకం మిరపను ఇక్కడ పండిస్తున్నారు. ఇక్కడ పండిన మిరప కాయలు నాణ్యతగా ఉండడంతో పాటు ఏడాది పొడవునా కారం నిల్వ ఉంటుందని వినియోగదారుల నమ్మకం. ఈ ప్రాంత వాసులు పట్టణ ప్రాంతాల్లోని తమ బంధువులకు పల్లంట్ల మిరపకాయలను పంపిస్తారు. ముదరకాపు తోటలు దెబ్బతినడంతో ఆశించినంతగా కాపు రాలేదు. ఫలితంగా ఫిబ్రవరి, మార్చి నెలల్లో కిలో మిర్చి రేటు గరిష్టంగా రూ.550 నుంచి రూ. 600 పలికింది. తోటల్లోని లేత కాపు దిగుబడి ఏప్రిల్ నెలలో వచ్చింది. ముదర కాపుల కంటే లేత కాపులు ఆశాజనకంగా ఉన్నాయని, దిగుబడులు పెరగడంతో రేటు తగ్గిందని రైతులు వివరించారు. అయినప్పటికీ ఈ ఏడాది మిరపసాగు లాభదాయకంగా ఉందని తెలిపారు. ఎకరాకు రూ.2.50 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు ఆదాయం వచ్చిందన్నారు. రెండేళ్లుగా దిగుబడులు లేక పెట్టుబడులు రాక నష్టపోయామని, ఈ ఏడాది మంచి ఆదాయం వచ్చిందని వివరించారు. ఈ ఏడాది ఏడెకరాల్లో పంట వేయగా లేత కాపు 150 బస్తాల దిగుబడి వచ్చిందని, ఏటా ఏప్రిల్ నెలలో తోటల్లో గంపకోత కోసే సమయమని, ప్రస్తుతం తోటల్లో కాయలు ఉన్నాయని మహిళా రైతు తెలిపారు.

సభ్యుల గైర్హాజరుపై చైర్‌పర్సన్ ఆగ్రహం

- అత్యవసర సమావేశానికి డుమ్మా కొట్టడం బాధ్యతా రాహిత్యమని వ్యాఖ్య
- ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్‌పై కౌన్సిల్లో చర్చ





సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నకుమారి, పరిమితంగా హాజరైన కౌన్సిల్ సభ్యులు

కొవ్వూరు: ప్రతిపాదిత కొవ్వూరు మునిసిపల్ మాస్టర్ ప్లాన్‌పై చర్చించి తగు నిర్ణయం తీసుకునేందుకు మంగళవారం ఏర్పాటు చేసిన కౌన్సిల్ అత్యవసర సమావేశానికి పూర్తిస్థాయిలో సభ్యులు హాజరు కాకపోవడంపై చైర్‌పర్సన్ భావన రత్నకుమారి మండిపడ్డారు. చైర్‌పర్సన్ అధ్యక్షతన మంగళవారం ఉదయం అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశం 11 గంటలకే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ మెజార్టీ సభ్యులు హాజరు కానందున గంట ఆలస్యంగా ప్రారంభమైంది. తొలుత వైఎస్సార్ సీపీ నుంచి ఐదుగురు, టీడీపీ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఒక సభ్యుడు మాత్రమే హాజరయ్యారు. ఇద్దరు వైస్ చైర్ పర్సన్‌లు, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణతో పాటు అధికార పార్టీకి చెందిన మరో ఏడుగురు సభ్యులు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. కీలక అంశంపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశానికి మెజారిటీ సభ్యులు గైర్హాజరు కావడం వారి బాధ్యతా రాహిత్యానికి నిదర్శనమని ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వ్యాఖ్యానించారు. ఇలాంటి కౌన్సిల్‌ను ఎక్కడా చూడలేదంటూ అసహనం వ్యక్తం చేశారు. మరో ముగ్గురు సభ్యులు హాజరు కావడంతో మధ్యాహ్నం 12.15 గంటలకు సమావేశం ప్రారంభమైంది.

మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించాలి

పట్టణంలోని అణంగపాల్ వారి వీధిని మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించాలని 22వ వార్డు కౌన్సిలర్ కంఠమణి రమేష్ కోరారు. ప్రస్తుతం 12 అడుగుల వెడల్పున ఉన్న ఈ వీధిని 60 అడుగులకు విస్తరిస్తే ఏ ఒక్క ఇల్లూ మిగలదన్నారు. వీలుపడని పక్షంలో కనీసం 40 అడుగులకైనా పరిమితం చేయాలని సూచించారు. టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ గతంలో ప్రతిపాదించిన మాస్టర్ ప్లాన్‌లోని రోడ్లు తాజా మాస్టర్ ప్లాన్‌లో లేకపోవడం సరికాదన్నారు. గాయత్రి థియేటర్ నుంచి మెయిన్ రోడ్డును కలిపే 40 అడుగుల రోడ్డును గతంలోనే 90 శాతం పూర్తి చేశామని, మిగిలిన పది శాతం వెడల్పునకు ప్రతిపాదించి ఉండాల్సిందన్నారు. మెజారిటీ కౌన్సిల్ సభ్యులు కొత్తవారైనందున మాస్టర్ ప్లాన్‌పై వారికి సరైన అవగాహన లేకపోవచ్చన్నారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని సూచించారు. ఏటిగట్టుపై ప్రతిపాదించిన వంద అడుగుల రోడ్డును మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించాలని బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ కోరారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ నుంచి 15 మందిలో ఏడుగురు, టీడీపీ నుంచి నలుగురు, బీజేపీ నుంచి ఒక సభ్యుడు హాజరయ్యారు. కొవ్వూరులో ముఖ్యమంత్రి కార్యక్రమానికి రూ.30 లక్షలు కేటాయించారు. క్రిస్టియన్ శ్మశాన వాటిక పరిశుభ్రతకు కేటాయించిన నిధుల విడుదలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

మాస్టర్ ప్లాన్‌పై 28 అభ్యంతరాలు

ప్రతిపాదిక మాస్టర్ ప్లాన్‌పై ఇప్పటి వరకూ 28 అభ్యంతరాలు అందినట్టు టౌన్ ప్లానింగ్ అధికారి ఎ. శ్రీధర్ ప్రకటించారు. అణంగపాల్ వీధిని మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించాలని ఏడు అభ్యంతరాలు వచ్చాయన్నారు. మెరక వీధి వాటర్ ట్యాంకు నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ మెయిన్ రోడ్డు 60 అడుగుల విస్తరణ ప్రతిపాదనను 40 అడుగులకు తగ్గించాలని, తొలగించాలని కోరుతూ ఆరు అర్జీలు వచ్చాయని చెప్పారు. పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ ఏరియా నుంచి నివాసిత ఏరియాకు మార్చాలని ఐదు, ఇండస్ట్రియల్ ఏరియాను ఆ ఏరియాలోనే ఉంచాలని రెండు, కాదు నివాసిత ఏరియాగా మార్చాలని రెండు వినతులు వచ్చాయన్నారు. వంద అడుగులుగా గోదావరి ఏటిగట్టు రోడ్డు ప్రతిపాదనను తొలగించాలని రెండు అభ్యంతరాలు వచ్చాయని శ్రీధర్ వివరించారు.

ప్రాధాన్యత క్రమంలో నిధుల కేటాయింపు

- ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ
- కొవ్వూరు మండల పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ

కొవ్వూరు: ప్రాధాన్యతా క్రమంలో అన్ని పంచాయతీలకు నిధులు కేటాయిస్తూ మండలాభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ (నారాయుడు) అన్నారు. కొవ్వూరు మండల పరిషత్ పాలకవర్గ అత్యవసర సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సమావేశంలో నారాయుడు మాట్లాడుతూ మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో చేపట్టే పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు కచ్చితంగా ఎంపీటీసీ సభ్యులను ఆహ్వానించాలని, విధిగా ప్రొటోకాల్ పాటించాలని అధికారులకు సూచించారు. జాతర నిర్వహించనున్న సీతంపేట గ్రామంలో వివిధ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.15 లక్షలు కేటాయించామన్నారు. ఈ నిధులతో ఆ గ్రామంలో ఐదు సిమెంట్ రోడ్లు, ఒక సీసీ డ్రెయిన్ నిర్మిస్తారని ఎంపీపీ ప్రకటించారు. ఎంపీడీవో కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున దాతల సహకారంతో గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు సూచించారు. చలివేంద్రాల నిర్వహణకు ఆయా పంచాయతీలు సహకరించాలని కోరారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ప్రొటోకాల్ ప్రకారం తమను ఆహ్వానించడం లేదని ఎంపీటీసీ సభ్యుడు ఎలిగంటి సురేష్, మద్దూరు సర్పంచ్ ఉప్పలూరి రాజేంద్రప్రసాద్(బాబ్జీ), దొమ్మేరు ఎంపీటీసీ సభ్యుడు యలమర్తి రాంబాబు ఆరోపించారు. మద్దూరు రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయించాలని సర్పంచ్ బాబ్జీ విజ్ఞప్తి చేశారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.85 లక్షలు మంజూరయ్యాయని, ఇంకా టెండర్లు ఖరారు కాలేదని ఇంజినీరింగ్ అధికారులు సమావేశంలో వివరణ ఇచ్చారు. ఉపాధి హామీ పథకం కింద మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టే 232 పనులకు రూ.2,62,07,919 నిధులు వెచ్చించాలని సమావేశంలో తీర్మానించారు. కాపవరం, పశివేదల, వాడపల్లి, వేములూరు, ధర్మవరం, పెనకనమెట్ట, సీతంపేట, దొమ్మేరు, కుమారదేవం, తోగుమ్మి తదితర గ్రామాల్లో ఈ పనులు చేపడతామని ఎంపీడీవో ప్రకటించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బొంతా వెంకటలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జీవీ జన్మదిన వేడుకలు



పల్లంట్లలో జీవీ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

దేవరపల్లి: విశాఖ స్మార్ట్ సిటీ అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు మంగళవారం ఘనంగా జరుపుకున్నాయి. పల్లంట్లలోని జీవీ స్వగృహం వద్ద పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. జీవీ తండ్రి, గోపాలపురం ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ, నియోజకవర్గ మహిళా కన్వీనర్ గారపాటి రమాప్రభ, మండల కన్వీనర్ కడలి హైమావతి, మండల సేవాదళ్ చైర్మన్ మాధవరపు వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా కార్యదర్శి గడా జగదీష్, పలువురు సొసైటీ అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సంగాయగూడెంలో వైద్యశిబిరం



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

దేవరపల్లి: మండలంలోని సంగాయగూడెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. విజయవాడకు చెందిన వైవీ రావు కార్డియాక్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని సంగాయగూడెం సర్పంచ్ కరుటూరి ఉషారాణి ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ శిబిరంలో వైద్యులు పరీక్షలు చేసి గుండె జబ్బులు ఉన్న రోగులను గుర్తించారు. వీరికి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దేవరపల్లి: చిన్నాయగూడెంలోని ఒక ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 800 కిలోల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఓ ఇంటిలో అక్రమంగా బియ్యం నిల్వ చేసినట్టు అందిన సమాచారం మేరకు ఆ శాఖ డిప్యూటీ తహసీల్దార్ సుజాత, సిబ్బంది తనిఖీ చేయగా 800 కిలోల బియ్యం పట్టుబడ్డాయి.ఆ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గోపాలపురంలోని పౌరసరఫరాల మండల గిడ్డంగికి తరలించారు. ఇంటి యజమానిపై 6ఎ కేసు నమోదు చేసినట్టు సుజాత తెలిపారు.

మూడు సొసైటీలకు కొత్తగా త్రీమెన్ కమిటీలు



మంత్రి వనిత నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న కాపవరం సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణ



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న తాడిపూడి సొసైటీ అధ్యక్షుడు మండిగ వెంకట గిరిధర్

కొవ్వూరు: నియోజకవర్గంలో కాపవరం, తాడిపూడి, మార్కొండపాడు సొసైటీలకు కొత్తగా త్రీమెన్ కమిటీలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొవ్వూరు మండలం కాపవరం సొసైటీ అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ మండలశాఖ అధ్యక్షుడైన సుంకర సత్యనారాయణ నియమితులయ్యారు. సభ్యులుగా ఐ.పంగిడికి చెందిన మాజీ ఉప సర్పంచ్ తోట దుర్గారావు, ధర్మవరానికి చెందిన జలాది రవికుమార్ నియమితులయ్యారు. వారిలో తోట దుర్గారావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. తాళ్లపూడి మండలంలోని తాడిపూడి సొసైటీ అధ్యక్షుడిగా అదే గ్రామానికి చెందిన మండిగ వెంకట గిరిధర్ సభ్యులుగా నామన సూర్యనారాయణ, బలుసు మళ్ల బ్రహ్మయ్య నియమితులయ్యారు. ఇక చాగల్లు మండలం మార్కొండపాడు సొసైటీ త్రీమెన్ కమిటీ అధ్యక్షుడిగా లకంసాని సూర్యప్రకాశరావు, సభ్యులుగా బొర్రా వెంకట్రావు, కాకి సంజీవరావు నియమితులయ్యారు. కొవ్వూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో హోం మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా మంగళవారం వారు నియామక ఉత్తర్వులు అందుకున్నారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు

- హోం మంత్రి తానేటి వనిత
- కొవ్వూరు ఆరో వార్డులో పర్యటన



కొవ్వూరు ఆరో వార్డు వాసులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: అర్హులందరికీ గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదే అని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. పట్టణంలోని ఆరో వార్డులో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాల ద్వారా ఏయే కుటుంబానికి ఎంత మేరకు మేలు చేకూరిందో లెక్కలతో సహా వివరించారు. వార్డు ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పేదలందరికీ మేలు చేస్తున్న జగనన్నకు ప్రజలంతా అండదండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, స్థానిక కౌన్సిలర్, వైస్ చైర్ పర్సన్ మన్నె పద్మ మరో వైస్ చైర్‌పర్సన్ గంధ్రోతు అంజనీదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ పట్టణ, మండల శాఖల అధ్యక్షులు రుత్తల భాస్కరరావు, సుంకర సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు, పలువురు నాయకులు ,పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏలూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటేనే నమ్మకం

- గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ద్వారకాతిరుమలలో జగనన్నే మా భవిష్యత్తు



ద్వారకాతిరుమలలో మహిళకు పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల: జగన్ అంటేనే నమ్మకమని.. చంద్రబాబు అంటే నయ వంచన, నమ్మక ద్రోహం, మోసానికి ప్రతిరూపమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ద్వారకాతిరుమలలోని యాదవ కాలనీలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే తలారి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. అనంతరం ప్రజల అనుమతితో వారి ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన పలువురు మహిళలు ఎమ్మెల్యే తలారిని ఘనంగా సత్కరించారు. కాలనీలో వాటర్ ట్యాంకును నిర్మించి తమకు మంచినీటి కష్టాలు తొలగించాలని కోరారు. త్వరలోనే మంచినీటి ట్యాంకును నిర్మిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ కుంటం స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెం, తాడిమళ్ల, కోరుపల్లి, పురుషోత్తపల్లి గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 6, 8 వార్డులో కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో పార్టీ పట్టణ శాఖ కార్యదర్శి గాజుల రంగారావు, రాష్ట్ర నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, కౌన్సిలర్లు పువ్వల రతీదేవి, గుర్రం శాంతిశ్రీ, సొసైటీ అధ్యక్షులు సుంకవల్లి శ్రీహరి, యాళ్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజిని ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, ప్రజా ప్రతినిధులు గ్రామంలో ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ప్రజల అనుమతితో వారి ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అంటించారు. కార్యక్రమంలో సర్పంచ్ మెండే వెంకట్రావు, దోనేపూడి సుధాకర్, బీఎస్సార్ యూత్ సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

తాళ్లపూడి మండలంలో శాంతి కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాధిక

తాళ్లపూడి: గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి అందరూ సహకరించాలని తహసీల్దార్ టి.రాధిక కోరారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని పది మంది సభ్యులతో ఓ శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లోనూ శాంతి కమిటీలు ఏర్పాటు చేయడం ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడవచ్చన్నారు. ఎస్సై కె. వెంకటరమణ మాట్లాడుతూ స్థానికంగా వివాదాస్పద ఘటనలు జరిగినపుడు ఆ ప్రాంత నాయకులు, ప్రతినిధులు తక్షణం స్పందిస్తే పరిస్థితి చేయిదాటదన్నారు. వివాదాల వల్ల చదువుకునే యువకులు కేసుల్లో చిక్కుకుంటే వారి భవిష్యత్తు పాడవుతుందన్నారు. దీనిపై తల్లిదండ్రులు తమ పిల్లలకు అవగాహన కల్పించాలని సూచించారు. సౌండ్ పొల్యూషన్ ఉండే డీజేలను నిషేధించాలని పలువురు సూచించారు. శాంతి కమిటీలతో వేగేశ్వరపురం వంటి ఘటనలు పునరావృతం కావన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, ఎంపీడీవో ఎం.రాజశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, ఆ పార్టీ నాయకులు గుడా విజయరాజు, వి.నంద, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ జీవన మార్గాన్ని చాటేది రంజాన్

నల్లజర్ల: ఉత్తమ జీవన మార్గాన్ని చాటే మాసం రంజాన్ అని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ హియమత్ అన్నారు. నల్లజర్ల మీనార్ మసీదు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై, ఇస్లాం ధర్మంలో రంజాన్ మాసానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్‌కే సుభాని, ఇలియాస్ షరీఫ్, ఆలీ మాస్టారు, ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ నాయకుడు కారుమంచి రమేష్, జెడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, యలమాటి శ్రీనివాస్, పల్లి సుబ్బారావు, మానవత తరపున కండెపు వెంకటరత్నం,అంజాద్ భాషా,లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఆనంద్ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక మస్జీద్‌ఎ అబూబాకర్ వద్ద బుధవారం ముస్లింలు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసారు. ముస్లింలకు అతి పవిత్రమైన జాగర్ రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు షేక్ సర్దార్, షరీఫ్, అన్వర్, జిలాని,రజాక్, రహేమతుల్లా, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు మాట్ల వెంకట దుర్గారావు ఆధ్వర్యంలో సమిశ్రగూడెం పెద్ద మసీదు వద్ద ముస్లింలకు మంగళవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చ అధ్యక్షుడు కాలేపు సాయి, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి షుక్ ఖ్రముద్దీన్, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేగ్, జిల్లా కార్యదర్శి షఫీ మీరా, నియోజకవర్గ కన్వీనర్ బండి సత్యనారాయణ, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, చింతల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

కో-ఆప్షన్ మెంబర్ మస్తాన్ మృతి



సయ్యద్ మస్తాన్

నల్లజర్ల: మండల పరిషత్ కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్ మస్తాన్ (56) మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో మృతి చెందారు. దూబచర్లకు చెందిన సయ్యద్ మస్తాన్ అస్వస్థతకు గురవడంతో ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో రెండు సార్లు ఆపరేషన్ చేశారు. సరికాకపోవడంతో ఆయనను నెల క్రితం హైదరాబాదు గచ్చిబౌలిలోని ఐఎంజీ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఆయన మృతి చెందినట్టు ఆయన కుమారుడు మునాఫ్ తెలిపారు. ఆయన భౌతిక కాయాన్ని దూబచర్లకు తీసుకు వస్తున్నారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తారని మునాఫ్ తెలిపారు.

చిన తిరుపతిలో అభివృద్ధి పనుల ప్రారంభం



శివాలయం ఘాట్ రోడ్డులో మంచినీటి బోరు శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో మంగళవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు జరిగాయి. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత శివాలయం ఘాట్ రోడ్డులో మండల పరిషత్ నిధులు రూ. 5 లక్షలతో నిర్మించిన మంచినీటి బోరును తలారి ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సంత మార్కెట్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎంపీటీసీ సభ్యులు రుద్ర నాగ సూర్యకళ, పెద్దిరెడ్డి రమ్య కుసుమల చేతుల మీదుగా ఎమ్మెల్యే ప్రారంభింపజేశారు. ఆ తర్వాత పసరుకోనేరు వద్ద పంచాయతీ నిధులు రూ. 90 వేలతో పునరుద్ధరించిన వాటర్ ప్లాంట్‌ను, అక్కడ దేవస్థానం మండపంలో పంచాయతీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, సర్పంచ్ కుంటం స్వర్ణలత, బొండాడ వెంకన్న బాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉక్కుర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.